# సాక్షి
## అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 6 । జూన్ । 2024






### ఎరుకుమాంబకు జలాభిషేకం

విశాఖ: దొండపర్తిలో కొలువుదీరిన ఎరుకు మాంబ అమ్మవారికి బుధవారం భక్తులు పసుపు నీటితో అభిషేకం నిర్వహించారు.



### తీరం అల్లకల్లోలం

విశాఖ: నగరంలోని తీర ప్రాంతం బుధవారం ఒక్కసారిగా అల్లకల్లోలంగా మారడంతో పర్యాటకులను లైఫ్‌గార్డ్స్ అప్రమత్తం చేశారు.



### నిండుకుండలా 'పెద్దేరు'

8లో

మాడుగుల: పెద్దేరు జలాశయం ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు భారీగా వరదనీరు చేరడంతో నిండుకుండను తలపిస్తోంది.

## న్యూస్‌రీల్

### 99.77 శాతం మేర పింఛన్ల పంపిణీ పూర్తి

- రాష్ట్రంలో జిల్లాకు తొలిస్థానం
- కలెక్టర్ విజయ సునీత

**సాక్షి,పాడేరు:** జిల్లాలోని 22 మండలాల పరిధిలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం సాయంత్రం నాటికి 99.77 శాతం మేర పూర్తయి రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని కలెక్టర్ ఎం.విజయ సునీత ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 1,27,064 మంది పింఛనుదారుల్లో 1,26,778 మందికి పంపిణీ చేశారని తెలిపారు.

### సంక్షేమం.. వైఎస్సార్‌సీపీ విజయానికి దోహదం

- ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



మాట్లాడుతున్న జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర

**ముంచంగిపుట్టు:** ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమానికి ప్రతిఫలంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు గిరిజనులు ఘన విజయం అందించారని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. బుధవారం ఆమె తన నివాసంలో మాట్లాడారు. గత ఐదేళ్లలో చేపట్టిన సంక్షేమ పాలన అరకు, పాడేరు అసెంబ్లీ అభ్యర్థులు రేగం మత్స్యలింగం, మత్స్యరాస విశ్వేశ్వరరాజు, అరకు ఎంపీ తనూజారాణి విజయాలకు దోహదపడిందన్నారు. జిల్లాలో కూటమి ప్రభావం ఏమాత్రం లేదన్నారు. వైఎస్సార్‌సీపీకి గిరిజన ప్రాంతం కంచుకోట అని అన్నారు. నీ ప్రాంతంలో వేసిన బోర్లు, సీసీ రోడ్లు, ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు వంటి కార్యక్రమాలు వైఎస్సార్‌సీపీ పక్షాన గిరిజనులు నిలిచేలా చేశాయన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కోఆర్డినేటర్ జగబంధు, మండల పార్టీ అధ్యక్షులు పద్మారావు, ఎంపీటీసీలు, సర్పంచులు, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- డీఎంహెచ్‌వో జమాల్‌బాషా



చింతగున్నలులో జ్వరపీడితురాలిని పరీక్షిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

**సాక్షి,పాడేరు:** సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో జమాల్‌బాషా కోరారు. బుధవారం ఆయన మినుములూరు పీహెచ్‌సీని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి వైద్య ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. ఆస్పత్రిలో ప్రసవాలు, తల్లీబిడ్డల ఆరోగ్య సేవలు, మరణాల వివరాలను తెలుసుకున్నారు. జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అనంతరం చింతగున్నలు గ్రామాన్ని సందర్శించారు.ఇక్కడ వైద్యసిబ్బంది చేపట్టిన వైద్యశిబిరాన్ని పరిశీలించారు. జ్వరాలు,ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న గిరిజనులను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా,డెంగ్యూ వంటి జ్వరాల నివారణకు వైద్యసేవలను విస్తృతం చేశామన్నారు. ఇంటింటా ఫీవర్ సర్వేలను వైద్యబృందాలు పకడ్బందీగా నిర్వహిస్తున్నాయని తెలిపారు.

## కప్ప కప్ప నీలాలు..

# కురవాలి వర్షాలు

- చుట్టబందలో విభిన్న ఆచారం
- ఏటా క్రమం తప్పకుండా కప్పల పండగ నిర్వహణ
- 80 ఏళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయం
- గ్రామస్తుల ఐక్యతకు నిదర్శనం
- వాటి జాతి పరిరక్షణకు కృషి

వర్షాలు కురవని సందర్భాల్లో వరుణుడి కరుణకోసం కప్పలను ఊరేగించడం.. వాటికి పూజలు చేసి.. పెళ్లి చేయడం చూస్తుంటాం. అయితే కినపర్తి పంచాయతీ చుట్టబందలో పరిస్థితి మాత్రం ఇందుకు భిన్నం. వర్షాలు కురిసినా.. కురవకపోయినా ఏటా కప్పకు పూజలు చేసి పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దాదాపుగా 150 సంవత్సరాల క్రితం ఏర్పడిన ఈ గ్రామంలో 80 ఏళ్ల నుంచి ఈ ఆచారం కొనసాగుతోంది.



కప్పను పూజించే చెట్టు వద్ద పసుపు, కుంకుమతో అలంకరణ



ప్రతీ ఇంటికి కప్పను ఊరేగింపుగా తీసుకువెళ్లి పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు



కప్పను జోలీలో ఊరేగింపుగా తీసుకెళ్తున్న గ్రామస్తులు

**కొయ్యూరు:** వరుణుడి కటాక్షం కోసం మండలంలోని చుట్టుబంద గ్రామంలో బుధవారం కప్ప పండగ నిర్వహించారు. గ్రామస్తులు వేకువజామున పణుకుల గెడ్డ జలాశయంలో పట్టుకున్న కప్పను గ్రామంలోకి తీసుకువచ్చి స్నానం చేయించారు. పసుపు, కుంకుమతో పూజించారు. జోలెలో ఉంచి పూలదండతో అలంకరించారు. అనంతరం గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ప్రతీ ఇంటి వద్దకు తీసుకువెళ్లిన కప్పకు పసుపు రాసి బిందెలతో నీళ్లు పోసి పూజించారు. అనంతరం దానిని ఒక చెట్టువద్దకు తీసుకువెళ్లి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఆ తరువాత తీసుకువచ్చిన జలాశయంలోనే తిరిగి విడిచిపెట్టారు. ఊరేగింపులో వాయిద్యాలు నడుమ నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అనంతరం పరిసర గ్రామాల ప్రజలను ఆహ్వానించి భోజనాలు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా గ్రామపెద్ద దుచ్చరి చిట్టిబాబు మాట్లాడుతూ వర్షాలు కురిసినా కురవకపోయినా కప్ప పండగను ఏటా నిర్వహిస్తామని తెలిపారు. గ్రామమంతా ఒక్కటై నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గ్రామంలో కప్పలకు ఎటువంటి హాని తలపెట్టమన్నారు. పండగ నిర్వహించిన వెంటనే వర్షం కురవడం ఎంతో నమ్మకం కలిగిస్తుందన్నారు.

**కప్ప అరిస్తే వర్షాలకు సంకేతం..**

వర్షం కురిసినప్పుడు కప్పలు అరుస్తుంటాయి. సాధారణ రోజుల్లో కూడా అవి అరుస్తుంటే కొద్ది రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని సంకేతంగా భావిస్తుంటారు. కప్పలు, స్పష్టంగా, రాబోయే వర్షాలను గుర్తిస్తాయని గ్రామీణ ప్రజల నమ్మకం. అంతేకాదు హిందూ సంప్రదాయంలో, మానవ జాతిని రక్షించడానికి విష్ణువు ఉభయచర (కప్ప) అవతారం తీసుకున్నాడని కూడా చెబుతుంటారు.

## 'సార్వత్రిక' విజేతలకు

# అభినందనల వెల్లువ



ఎంపీగా విజయం సాధించిన తనూజరాణి దంపతులను సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు



పాడేరు ఎమ్మెల్యేగా విజయం సాధించిన విశ్వేశ్వరరాజును సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

**సాక్షి,పాడేరు:** అరకు ఎంపీగా విజయం సాధించిన డాక్టర్ గుమ్మా తనూజరాణికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. పాడేరులోని ఆమె నివాస గృహానికి బుధవారం పాడేరు, అరకులోయ నియోజకవర్గాల పరిధిలోని వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి అభినందనలు తెలుపుతున్నారు. దీనిలో భాగంగా ఎంపీ తనూజారాణి, చెట్టి వినయ్ దంపతులను బుధవారం మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు జంపరంగి లిల్లీ, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ తెడబారికి సురేష్‌కుమార్ సత్కరించారు. పెదబయలు జెడ్పీటీసీ కూడా బొంజుబాబు, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు,సర్పంచ్ కాతరి సురేష్ పాల్గొన్నారు.

**చింతపల్లిలో విశ్వేశ్వరరాజుకు..**

**చింతపల్లి రూరల్:** సార్వత్రిక ఎన్నికల్లో పాడేరు ఎమ్మెల్యేగా విజయం సాధించిన మత్స్యరాస విశ్వేశ్వరరాజును బుధవారం తాజంగిలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు సత్కరించాయి. తాజంగి పంచాయతీ వార్డు సభ్యుడు సదాశివ, సీనియర్ నాయకుడు బాబూరావు తదితరులు అభినందించారు. ఈ సందర్భంగావిశ్వేశ్వరరాజు మాట్లాడుతూ మన్యం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు.తన విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు కోరాబు అంగదరావు, లింగన్నబాబు, సాయిశంకర్, రమణ, సోమరాజు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## మోదమ్మ ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

- ఈనెల 9 నుంచి మూడు రోజులపాటు నిర్వహణ
- విజయవంతానికి కమిటీల కసరత్తు



మోదకొండమ్మతల్లి

**సాక్షి,పాడేరు:** ఉత్తరాంధ్ర భక్తుల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మతల్లి గిరిజన జాతరను ఈనెల 9 నుంచి 11 వరకు మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ఆలయ కమిటీ అధ్యక్షురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ,ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలంనాయుడు ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కొట్టగుల్లి రామారావు, తమర్బ ప్రసాద్‌నాయుడు, వెంకటరమణ, యాదగిరి శ్రీనివాస్ తదితరులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఎగ్జిబిషన్ పనులు. పట్టణంలోని ప్రధాన రోడ్లు, వీధుల్లో విద్యుత్ అలంకరణ పనులు వేగవంతం చేశారు. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాలు విజయవంతం చేయడంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటుచేస్తున్నారు. జిల్లా అధికార యంత్రాంతం, ఐటీడీఏ, పోలీసుశాఖలు ఉత్సవ కమిటీకి అవసరమైన సహకారం అందిస్తున్నాయి

# గిరి విద్యార్థుల సత్తా

**మధురవాడ:** నీట్ ఫలితాల్లో మారికవలసలోని గిరిజన గురుకుల ఇంగ్లిష్ మీడియం స్కూల్ ఆవరణలోని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల శిక్షణ సంస్థ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ శిక్షణ సంస్థకు చెందిన 28 మంది పరీక్షకు హాజరు కాగా.. 12 మంది అర్హత సాధించారు. వీరిలో ఇద్దరు సీట్లు పొందే అవకాశం ఉంది. అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం ఈదుల గరువు గ్రామానికి చెందిన జి.గోపాలరావు 482 మార్కులతో ఆలిండియా స్థాయిలో ఎస్టీ కేటగిరీలో 3,686 ర్యాంకు సాధించాడు. ప్రముఖ ప్రభుత్వ కళాశాలలో ఆయనకు ఎంబీబీఎస్‌లో సీటు వచ్చే అవకాశం ఉంది. అలాగే చింతపల్లి మండలం పాత కిన్నెర గ్రామానికి చెందిన పి.మత్స్యరాజు 384 మార్కులతో ఎస్టీ కేటగిరీలో ఆలిండియా స్థాయిలో 10,859 ర్యాంకు పొందాడు. ప్రభుత్వ కళాశాలలో బీడీఎస్ కోర్సులో సీటు పొందే అవకాశం ఉంది. విజేతలను సంస్థ ప్రిన్సిపాల్ ఎల్.శివప్రసాద్, ఇతర అధ్యాపకులు అభినందించారు.

### నాన్న ఉండుంటే ఎంతో సంతోషించేవారు



మాది హుకుంపేట మండలం ఈదుల గరువు. అమ్మ లక్ష్మి వ్యవసాయ కూలీ. నాన్న ప్రసాదరావు రెక్కల కష్టంతో చదివించారు. నేను డాక్టర్ కావాలన్నది ఆయన కల. ఆయన ఆకాంక్షను నేరవేర్చేందుకు కష్టపడి చదివాను. 482 మార్కులతో ఆలిండియా స్థాయిలో 3,686 ర్యాంకు రావడం చాలా ఆనందంగా ఉంది. అయితే ఈ సమయంలో నాన్న మా మధ్య లేక పోవడం చాలా బాధగా ఉంది.– **జి.గోపాలరావు,** మారికవలస గిరిజన గురుకుల శిక్షణ సంస్థ

### ఆనందంగా ఉంది



మాది అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతపల్లి మండలం, పాత కిన్నెర గ్రామం. తల్లిదండ్రులు నీలమ్మ, బంగార్రాజు వ్యవసాయ కూలీలు. మాకు ఆర్థిక పరిస్థితి బాగులేక పోయినా.. గిరిజన గురుకుల సంస్థ మాకు మంచి అవకాశం కల్పించింది. 384 మార్కులతో జాతీయ స్థాయిలో 10,859వ ర్యాంకు సాధించాను. ప్రభుత్వ కళాశాలలో బీడీఎస్‌లో సీటు వచ్చే అవకాశం ఉంది. చాలా ఆనందంగా ఉంది.

– **మత్స్యరాజు,** మారికవలస గిరిజన గురుకుల శిక్షణ సంస్థ

# ఈదురు గాలుల బీభత్సం

- కొయ్యూరు ఐటీడీఏ కాలనీలో కూలిన విద్యుత్ స్తంభాలు
- 60 గ్రామాలకు నిలిచిన విద్యుత్ సరఫరా
- జిల్లావ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో భారీ వర్షం
- ఖరీఫ్ సాగుకు అనుకూలమంటున్న వ్యవసాయశాఖ
- లోతట్టు ప్రాంతాలు జలమయం



సింగవరం ఐటీడీఏ కాలనీ వద్ద గాలులకు పడిపోయిన విద్యుత్ స్తంభం



వాగులో కొట్టుకుపోతున్న ట్రాక్టర్ ఇంజన్



తోకవలసలో మృతిచెందిన మేకలు

**కొయ్యూరు:** మండలంలో బుధవారం మధ్యాహ్నం నుంచి వీచిన ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. కాకరపాడు సబ్ స్టేషన్ పరిధిలోని సింగవరం ఫీడర్‌కు సంబంధించిన ఐటీడీఏ కాలనీలో ఏడు విద్యుత్ స్తంభాలు నేల కూలాయి. దీంతో సుమారు 60 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాజేంద్రపాలెం,కొయ్యూరులో తాగునీటి సరఫరా వ్యవస్థపై ప్రభావం చూపనుంది. సమస్యను గుర్తించిన విద్యుత్‌శాఖ సిబ్బంది స్తంభాల పునరుద్ధరణ పనులను వేగవంతం చేశారు. మరోపక్క భారీ వర్షం కురిసింది. అటవీశాఖ కలపడిపో వద్ద పాకపై చెట్టుకొమ్మలు విరిగిపడటంతో పాక్షికంగా నష్టం జరిగింది. జీడిపిక్కల కొనుగోలు కేంద్ర భవనం పైకప్పు దెబ్బతింది.

**రాజవొమ్మంగి:** ఇక్కడికి పరిసర ప్రాంతాల్లో బుధవారం మధ్యాహ్నం ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. అప్పటి వరకు మండే ఎండలకు, ఉక్కబోతకు ఉక్కిరిబిక్కిరి అయిన స్థానికులు ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో ఉపశమనం పొందారు. ఈదురుగాలులకు బోయపాడులో రెండు విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వీటి పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నట్టు ట్రాన్స్‌కో ఏఈ చిన్నబాబు తెలిపారు. సుమారు గంటకు పైగా కురిసిన వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మట్టిరోడ్లు చిత్తడిగా మారాయి. తొలకరి వర్షాలు ప్రారంభంతో రైతుల్లో ఆనందం నెలకొంది.

**రోడ్డుపై నుంచి వరదనీరు..**

**ముంచంగిపుట్టు:** మండలంలో బుధవారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రతకు అల్లాడిన ప్రజలకు వాతావరణం చల్లబడటంతో ఉపశమనం పొందారు. సుజనకోట పంచాయతీ సంగిడిగొంది గ్రామానికి వెళ్లే మార్గంలో రహదారిపై నుంచి వరదనీరు ప్రవహించడంతో రాకపోకలు సాగించేందుకు గిరిజనులు ఇబ్బందులు పడ్డారు. జర్రెల, ఏనుగురాయి, కరిముఖిపుట్టు పంచాయతీలోని పలు గ్రామాల రహదారులు బురదమయంగా మారాయి. రబీ పైరు ముంపునకు గురి కావడంతో నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

**రోడ్లన్నీ జలమయం**

**అనంతగిరి:** మండల కేంద్రంలోని మధ్యాహ్నం నుంచి కురుస్తున్న భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ఉదయం అంతా ఎండతీవ్రత అధికంగా ఉంది. మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణంలోని మార్పుచోటుచేసుకుని, ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది..

**పిడుగుపాటుకు మేకలు మృతి**

**అనంతగిరి:** మండలంలోని బుధవారం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. కొండిబ పంచాయతీ తోకవలస గ్రామంలో గిరిజనుడికి చెందిన ఆరు మేకలు పిడుగుపాటుకు మృతి చెందాయి. అధికారులు స్పందించి ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

**హైవే రోడ్ల పనులకు అంతరాయం**

**జి.మాడుగుల:** మండలంలో బుధవారం ఉరుములు, మెరుపులు, పిడుగులతో ఎడతెరిపిలేని వర్షం కురిసింది. పాడేరు– జి.మాడుగుల, చింతపల్లి, నుర్మతి, మద్దిగరువు రోడ్లు, గ్రామాల్లోని అంతర్గత రోడ్డు జలమయమయ్యాయి. ద్విచక్ర వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఎన్‌హెచ్ 516ఈ రోడ్ల పనులకు అంతరాయం ఏర్పడింది.

**వాగులో కొట్టుకుపోయిన ట్రాక్టర్ ఇంజిన్**

**రాజవొమ్మంగి:** మండలంలోని లబ్బర్తి–లాగరాయి గ్రామాల మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న చిన్నేరు కొండవాగులో బుధవారం సాయంత్రం ఓ ట్రాక్టర్ ఇంజన్ కొట్టుకొని పోయింది. లబ్బర్తికి చెందిన ట్రాక్టర్ యజమాని/డ్రైవర్ నేరేటి రాజుబాబు లాగరాయిలో దుక్కి పనులు పూర్తి చేసుకొని స్వగ్రామం లబ్బర్తి వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకొంది. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులోంచి టాక్టర్‌పై రాజబాబు వెళ్తుండగా కొట్టుకుపోయింది. స్థానికులు రాజబాబును మాత్రమే రక్షించగలిగారు. రెండు రోజుల క్రితమే కొత్త ట్రాక్టర్ కొనుగోలు చేశానని, ఇలా కొట్టుకుపోవడం బాధాకరమని అతను వాపోయాడు. కొయ్యూరు మండల పరిసర ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా వాగు పొంగినట్టు స్థానికులు తెలిపారు. లబ్బర్తి చప్టా వద్ద కూడా ఉధృతంగా ప్రవహిస్తుండటంతో బుధవారం రాత్రి నెల్లిమెట్ట, నెల్లిమెట్ల కాలనీ, ముంజవరప్పాడు తదితర గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



సంకిడిగొంది గ్రామానికి వెళ్లే రహదారిపై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు



రాజవొమ్మంగి ప్రాంతంలో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

### ఖరీఫ్‌కు ఎంతో మేలు



పాడేరులో కురుస్తున్న వర్షం

**సాక్షి,పాడేరు:** నైరుతి ప్రభావంతో ఏజెన్సీలో బుధవారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మబ్బు వాతావరణంతో చల్లదనం నెలకొంది.మధ్యాహ్నం ఒంటి గంట నుంచి పాడేరు పట్టణంతో పాటు సమీప గ్రామాల్లో భారీ వర్షం కురవడంతో జనజీవనానికి కాస్త అంతరాయం ఏర్పడింది. రాత్రి వరకు వర్షం కురుస్తూనే ఉంది. ఖరీఫ్ వ్యవసాయానికి ఎంతో ఉపయోగమని జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్ నందు తెలిపారు.

# పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత

- అన్ని పాఠశాలల్లో ఎకో క్లబ్‌లు
- జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావు



పాడేరులో ర్యాలీ నిర్వహిస్తున్న డీఈవో బ్రహ్మజీరావు, ఎంఈవోలు, సర్వశిక్ష అధికారులు, ఉపాధ్యాయులు

**సాక్షి,పాడేరు:** పర్యావరణ పరిరక్షణను ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మజీరావు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జిల్లా విద్యాశాఖ బుధవారం పాడేరులో ఘనంగా నిర్వహించింది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి పాతబస్టాండ్‌లోని డాక్టర్ అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ చేపట్టి పర్యావరణ పరిరక్షణ,మొక్కల పెంపకంపై అవగాహన ర్యాలీ చేపట్టింది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో డీఈవ, ఎంఈవోలు, సర్వశిక్ష అధికారులు,ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. అనంతరం పాఠశాలల్లో చేపట్టే పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు, ఎకో క్లబ్‌ల ఏర్పాటుపై సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో మిషన్‌లైఫ్ ఎకో క్లబ్‌లను విద్యార్థులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో ఏర్పాటు చేయాలన్నారు. ఈనెల 19 వరకు పాఠశాలల్లో రోజువారి కార్యక్రమాలను కూడా విజయవంతంగా చేపట్టాలన్నారు.ఎంఈవోలు సరస్వతి, పుష్పజోషప్, డీసీడీవో సూర్యకుమారి, సమగ్ర శిక్ష అధికారులు భాస్కరరావు, ప్రకాష్, సీఆర్‌టీలు పాల్గొన్నారు.

**రంపచోడవరం:** అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవంలో భాగంగా స్థానిక ఏపీఆర్ బాలుర పాఠశాల, కళాశాలలో అటవీ అధికారులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సబ్ డీఎఫ్‌వో కె.శ్రీవాణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచి ప్రకృతిని పరిరక్షించాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి పెనుముప్పు తప్పదన్నారు.

**చింతపల్లి రూరల్:** మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని డీఎఫ్‌వో సూర్యనారాయణ అన్నారు. స్థానిక డివిజనల్ అటవీ కార్యాలయంలో బుధవారం ఆయన ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతవరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరిగిపోతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రేంజ్ అధికారులు పాత్రుడు, జగదీశ్వరరావు, భార్గవ్ వర్మ పాల్గొన్నారు.

**ఐసీడీఎస్ ఆధ్వర్యంలో..**

**గూడెంకొత్తవీధి:** మండల కేంద్రంలో ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. సూపర్‌వైజర్లు వలసమ్మ, మోహిని పాల్గొన్నారు



చింతపల్లిలోని అటవీశాఖ కార్యాలయంలో మొక్కలు నాటుతున్న డీఎఫ్‌వో సూర్యనారాయణ



రంపచోడవరం మొక్కలు నాటుతున్న డీఎఫ్‌వో శ్రీవాణి, చిత్రంలో అటవీశాఖ అధికారులు

## క్లుప్తంగా

### నిండుకుండలా 'పెద్దేరు'

మాడుగుల: మండలంలో రెండు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. దీంతో పెద్దేరు జలాశయంలోకి ప్రస్తుతం 50 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. జలాశయ గరిష్ఠ నీటి మట్టం 137 మీటర్లు కాగా, ప్రస్తుతం 136.15 మీటర్లకు నీటి మట్టం పెరిగింది. గత ఏడాది ఇదే సమయానికి 130 మీటర్లు మాత్రమే ఉంది. ప్రస్తుతం నీటి మట్టం పెరగడంతో ఖరీఫ్‌లో సాగునీటికి ఢోకా ఉండదని ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వరి నారు మడులు సిద్ధం చేశారు. మరో వారం రోజులలో నారు వేయనున్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన భీమ

ఎటపాక: ఎటపాక మండల పరిధిలోని రామగోపాలపురం వద్ద బుదవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి దుర్మరణం చెందాడు. ఎటపాక ఎస్‌ఐ పార్ధసారధి తెలిపిన వివరాల ప్రకారం...పూసుగూడెం ప్రాంతానికి చెందిన మడివి భీమ(35) ద్విచక్రవాహనంపై భద్రాచలం వచ్చి తిరిగి తన గ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో భద్రాచలం ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు కుంట నుంచి విజయవాడ వెళ్తుంది. ఎటపాక మండలం రామగోపాలపురం వద్ద జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న బస్సును భీమ తన ద్విచక్రవాహనంతో ఢీకొట్టాడు.ఈ ప్రమాదంలో భీమా అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ పార్ధసారధి చెప్పారు.

### ప్రశాంతంగా సార్వత్రిక పరీక్షలు

విశాఖ విద్య : స్వార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలోని టెన్త్, ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా జరుగుతున్నాయి. బుధవారం ఉదయం జిల్లాలోని 3 కేంద్రాల్లో జరిగిన పదో తరగతి పరీక్షలకు 261 మంది విద్యార్థులు హాజరయ్యారు. అదేవిధంగా మధ్యాహ్నం జిల్లాలోని ఐదు కేంద్రాల్లో జరిగిన ఇంగ్లిష్ పరీక్షలకు 206 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా ఫ్లెయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు నిర్వహించాయని డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు.

# ధర బాగున్నా.. పండని తమలపాకు

- దిగుబడి తగ్గడంతో రైతన్న దిగాలు
- భారంగా మారిన రవాణా ఖర్చులు



తమలపాకు తోటలు



ఎగుమతికి బుట్టల్లో సర్దుతున్న తమలపాకులు



తమలపాకుల లోడు

పాయకరావుపేట: తమలపాకులు.. ఈ ప్రాంతంలో పండే అరుదైన పంట. మండలంలోని సత్యవరం, మాసాహెబుపేట, పెదరాంభద్రపురం, శ్రీరాంపురం, మంగవరం, గోపాలపట్నం, అరట్లకోట గ్రామాల పరిధిలో సుమారు 800 ఎకరాల్లో రైతులు తమలపాకు తోటలు పెంచుతున్నారు. 3 వేల కుటుంబాలకు ఈ పంటే జీవనాధారం. మార్చి నుంచి జూన్ వరకు శుభముహూర్తాలు ఎక్కువ ఉండడంతో మంచి గిరాకీ ఉంది. మంచి ధర పలుకుతోంది. అయితే ఈసారి దిగుబడి తగ్గడంతో రైతులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. పంథా (150) ఆకుల ధర గత ఏడాది 30–35 రూపాయలు ఉండగా ఈసారి రూ.50లు పలుకుతోంది. రూ.500 ఉండే బుట్ట ధర ఇప్పుడు వెయ్యి రూపాయలు. ధర బాగున్నా చీడపీడలు, రవాణా ఖర్చులు పెరిగిన కారణంగా ఈ సీజన్ ప్రోత్సాహంగా లేదని రైతులు చెబుతున్నారు.

**పలు రాష్ట్రాలకు ఇక్కడి నుంచే రవాణా**

వారానికి 4, 5 లారీల్లో మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలకు ఈ మండలం నుంచే తమలపాకు ఎగుమతి అవుతుంది. వారానికి 3 వ్యాన్‌ల ద్వారా హైదరాబాద్‌కు సరకు పంపిస్తారు. రైళ్లలో కూడా ఆయా రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంది. గతంలో రోజుకు 3, 4 లారీల్లో సరకు పంపించేవారు. రైతులు అరెకరం నుంచి 5 ఎకరాల వరకు తమలపాకు తోటలు వేస్తుంటారు. ప్రతి ఎకరానికి రెండు లక్షల రూపాయల వరకు పెట్టుబడి ఖర్చులు అవుతాయి. రెండు సంవత్సరాల పాటు ఈ తోటలు జీవిస్తాయి. తోటలు మంచిగా పెరిగితే పెట్టుబడి పోగా 2 లక్షల వరకు ఆదాయం వస్తుంది. అయితే ఈ సీజన్‌లో తోటలు తెగుళ్ల బారిన పడడంతో రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. దిగుబడి తగ్గిపోయి రైతులకు అనుకున్నంతగా ఆదాయం రాలేదు. ప్రస్తుతం శుభముహూర్తాలు, శుభకార్యాలు అధికంగా ఉండడం వలన ధర పెరిగినప్పటికీ దిగుబడి తగ్గడం, రవాణా ఖర్చులు పెరగడం వలన రైతులు నిరాశ చెందుతున్నారు. ఆదాయం తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఆశించిన ఆదాయం రాలేదు**



నేను 3 ఎకరాల్లో తమలపాకు తోట వేశాను. రూ.5 లక్షల పెట్టుబడి ఖర్చులు అయ్యాయి. తెగుళ్ల కారణంగా కొద్దిగా తోట చనిపోయింది. సకాలంలో వర్షాలు లేకపోవడం వలన దిగుబడి తగ్గింది. మార్కెట్‌లో ధర బాగున్నప్పటికీ దిగుబడి లేకపోవడం వలన ఆశించిన విధంగా ఆదాయం రాలేదు. రవాణా చార్జీలు పెరిగాయి. గతంకన్నా పెట్టుబడి ఎక్కువ.. దిగుబడి తక్కువగా ఉంటోంది.

–తమ్మిర్సి సత్యనారాయణ, తమలపాకు రైతు, సత్యవరం, పాయకరావుపేట మండలం

# నీట్‌లో రాణించిన రైతుబిడ్డ



నీట్‌లో ఉత్తమ మార్కులు సాధించిన కిరణ్‌కు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

యలమంచిలి రూరల్: వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన నీట్-2024 ఫలితాల్లో సాధారణ రైతు కుటుంబానికి చెందిన విద్యార్థి రాజాన కిరణ్ మంచి ప్రతిభ కనబరిచాడు. యలమంచిలి మండలం పురుషోత్తపురం గ్రామానికి చెందిన రాజాన కిరణ్ నీట్(యూజీ) ఫలితాల్లో 720 మార్కులకు గాను 705 మార్కులు సాధించి, ఓబీసీలో 368 ర్యాంక్, ఓపెన్ కేటగిరీలో 1142 ర్యాంక్ పొందాడు. 10వ తరగతిలో 476/500 మార్కులు(సీబీఎస్‌ఈ),12వ తరగతిలో 458/500 (సీబీఎస్‌ఈ) మార్కులు సాధించాడు. ఢిల్లీ ఎయిమ్స్‌లో చేరి మంచి కార్డియాలజిస్టు కావడమే తన లక్ష్యంగా కిరణ్ 'సాక్షి'కి తెలిపాడు.విద్యార్థి తండ్రి రాజాన సత్యనారాయణ సాధారణ రైతు. కిరణ్ నీట్‌లో ఉత్తమ మార్కులు సాధించడం పట్ల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.తన ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఇంటర్మీడియెట్ చదివించేందుకు తన కుమారుడికి విశాఖ డెయిరీ చైర్మన్,వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆడారి ఆనంద్‌కుమార్ సంవత్సరానికి రూ.50 వేల చొప్పున రెండేళ్లు రూ.లక్ష సాయం చేశారని సత్యనారాయణ చెప్పారు. ఆడారి ఆనంద్‌కుమార్ సహాయాన్ని మరిచిపోలేనని, ఎల్లప్పుడూ అతనికి రుణపడి ఉంటానని ఆయన తెలిపారు. విశాఖ నారాయణ కళాశాలలో చదివిన కిరణ్‌ను బుధవారం కళాశాల డీజీఎం హనుమంతరావు, ఏజీఎం నాగేశ్వరరావు,ఇన్‌చార్జ్ సింహాద్రి,అధ్యాపకుడు పురుషోత్తపురం గ్రామస్తులు అభినందించారు.

**హేమంత్‌కు 557 ర్యాంకు**

నాతవరం: మారుమూల గిరిజన గ్రామానికి చెందిన సోలం హేమంత్ నీట్ ఫలితాల్లో 557 ర్యాంకు సాధించాడు. మండలంలో వెదురుపల్లి పంచాయతీ శివారు కోడవటిపూడి గ్రామానికి చెందిన హేమంత్ పశ్చిమ గోదావరి జిల్లాలో ఓ ప్రైవేటు ఇంటర్మీడియెట్ కాలేజీలో చదివాడు.హేమంత్ తండ్రి సోలం కొండబాబు మండలంలో సరుగుడుపంచాయతీ శివారు రామన్నపాలెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. హేమంత్‌కు ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి ఎంతఃవోలు తాడి అమృత్‌కుమార్, కామిరెడ్డి వరహలబాబు అభినందనలు తెలిపారు.

**నీట్‌లో గ్రామీణ విద్యార్థుల ప్రతిభ**

మునగపాక, రోలుగుంట : జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ ప్రవేశపరీక్షలో మునగపాక మండలం గంగాదేవిపేట, గణపర్తికి చెందిన విద్యార్థులు మెరుగైన మార్కులు సాధించి మండలానికి గుర్తింపు తీసుకువచ్చారు. గణపర్తికి చెందిన గుర్రం వీర వెంకట శరణ్య నీట్‌లో 681 మార్కులు సాధించింది. ఆల్ ఇండియా ర్యాంక్‌గా 8412 సాధించింది.



మొల్లేటి నివాస్



గుర్రం వీరవెంకట శరణ్య



హేమంత్

చూచుకొండ పీహెచ్‌సీలో ఎంపీహెచ్‌ఈవోగా పనిచేస్తున్న గుర్రం శ్రీనివాసరావు కుమార్తె వీర వెంకట శరణ్య జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ ప్రవేశపరీక్ష రాసింది. 720 మార్కులకు గాను 681 మార్కులు సాధించి ఈ ప్రాంతానికి పేరు తీసుకువచ్చిందని వైద్యాధికారులు ఎస్తేర్‌రాణి, వినోద్‌కుమార్, రోలుగుంట పీహెచ్‌సీ వైద్యురాలు కె.ధనలక్ష్మి హర్షం వ్యక్తం చేస్తున్నారు. గంగాదేవిపేటకు చెందిన మొల్లేటి నివాస్‌కు 614 మార్కులు వచ్చాయి. 720 మార్కు లకు గాను 614 మార్కులు సాధించాడు. గ్రామానికి చెందిన మొల్లేటి దేవీచంద్ర దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు నివాస్ ఇంటర్మీడియట్ విజయవాడలో చదువుకున్నాడు. ఎంబీబీఎస్‌కు సంబంధించిన నిర్వహించిన ప్రవేశపరీక్షకు నివాస్ హాజరయ్యాడు. జాతీయ స్థాయిలో వెలువడిన ఫలితాల్లో భాగంగా నివాస్ 720 మార్కులకు గాను 614 మార్కులను కైవసం చేసుకున్నాడు. కృషి,పట్టుదల ఉంటే చదువులో రాణించవచ్చని నివాస్ రుజువు చేశాడు. గ్రామీణ ప్రాంతంలో కష్టపడి చదివి నీట్‌లో మెరుగైన మార్కులు సాధించిన నివాస్‌ను పలువురు అభినందిస్తున్నారు.

# విద్యార్థులూ.. చూసొద్దాం రండి!

- వేసవిలో విజ్ఞానాన్ని పంచుతున్న 'ట్రిడెంట్'
- ఎన్ఏడీలో ఎన్ఎస్టీఎల్ ప్రదర్శన శాల



జలాంతర్గామి మిసైల్



ట్యాంకర్



ఎన్ఎస్‌టీఎల్ గేటు ఎదురుగా ఏర్పాటు చేసిన ట్రిడెంట్



జలంతర్గామి రాకెట్లు

విశాఖ విద్య: ఎన్ఏడీ సెంటర్ ఎన్ఎస్టీఎల్ గేటుకు ఎదురుగా ఏర్పాటు చేసిన యుద్ధ పరికరాల ప్రదర్శనశాల విజ్ఞానాన్ని పంచుతోంది. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని డిఫెన్స్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(డీఆర్‌డీవో)కు అనుసంధానంగా ఇక్కడి నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లేబొరేటరీ(ఎన్ఎస్టీఎల్) ప్రజోపకరమైన కార్యక్రమాల్లో భాగంగా 'ట్రిడెంట్'ను రూపొందించింది. డీఆర్‌డీవో, ఎన్ఎస్టీఎల్ ఆధ్వర్యంలో తయారు చేసిన అధునాతన యుద్ధ పరికరాల నమూనాలను ఇక్కడ ప్రదర్శనశాలలో ఏర్పాటు చేశారు. సైన్స్, సాంకేతిక రంగాల్లో ప్రయోగాలకు సిద్ధమవుతున్న భావి సైంటిస్టులు, విద్యార్థులు, అదే విధంగా ఉద్యోగులు, సాధారణ ప్రజలు సైతం దీనిని సందర్శించే అవకాశాన్ని కల్పించారు. యుద్ధ నౌక, యుద్ధ విమానం, వాయు, జలంతర్గామిలో ఉపయోగించే రాకెట్లు ఇలా వివిధ రకాల యుద్ధ పరికరాల నమూనాలు నేటి తరం వారికి విజ్ఞానాన్ని పంచుతున్నాయి. 'ట్రిడెంట్'పేరుతో ఏర్పాటు చేసిన దీనిని మరింత సుందరంగా, అందరినీ ఆకట్టుకునేలా తీర్చిదిద్దేందుకు ఎన్ఎస్టీఎల్ యాజమాన్యం ఎంతో శ్రద్ధ తీసుకుంటోంది. చుట్టూ కంచె మాదిరి ఏర్పాటు చేసి, లోపలికి వెళ్లేందుకు గేటు పెట్టారు. చుట్టూ ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా గ్రీనరీ పెంచుతున్నారు. ఈ నమూనాలను అటుగా వచ్చే వారు ఆసక్తిగా తిలకిస్తున్నారు.



### నాణ్యమైన జీవన ఎరువులతో అధిక దిగుబడులు




మాట్లాడుతున్న శాస్త్రవేత్త విశాలాక్షి

నక్కపల్లి: నాణ్యమైన జీవన ఎరువులతో అధిక దిగుబడులు సాధించడంతో పాటు సాగు ఖర్చు తగ్గించుకోవచ్చని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం ఏడీఆర్ డాక్టర్ పి.వి.కె.జగన్నాథరావు, శాస్త్రవేత్త ఎం.విశాలాక్షి తెలిపారు. ఖరీఫ్ విత్తన దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం రైతులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రైతులను ఖరీఫ్ సీజన్‌కు సన్నద్ధం చేసేందుకు ఖరీఫ్ విత్తన దినోత్సవాన్ని నిర్వహించినట్టు చెప్పారు. నైరుతి రుతుపవనాల సాధారణంగా జూన్ మొదటి వారంలో మనరాష్ట్రంలో ప్రారంభమవుతాయని, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. విత్తన ప్రాముఖ్యత, అధిక దిగుబడు సాధించేందుకు తీసుకోవలసిన చర్యల గురించి వివరించారు. ఆర్బీకేల్లో వరివిత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో చెరకు ప్రధానశాస్త్రవేత్త డాక్టర్ డి.ఆదిలక్ష్మి, డి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.


### విద్యాకానుక కిట్ల పరిశీలన

విశాఖ విద్య: విద్యార్థులకు అందజేసే విద్యాకానుక కిట్లను విద్యాశాఖ ఆర్జేడీ బి.విజయభాస్కర్ బుధవారం పరిశీలించారు. పాఠశాలల పర్యవేక్షణలో భాగంగా పెందుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. కాంప్లెక్స్ పరిధిలో పాఠశాలలకు సరఫరా చేసే నిమిత్తం నిల్వ చేసిన విద్యాకానుక కిట్లను పరిశీలించారు. విద్యార్థులకు చేరే వరకు కానుకలోని ప్రతీ వస్తువు కూడా భద్రంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత స్టాక్ పాయింట్ నిర్వాహకులదేనన్నారు. స్టాక్ పాయింట్లలో ఏమైనా ఇబ్బందులు ఉంటే సకాలంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. డీఈవో ఎల్.చంద్రకళ, డిప్యూటీ డీఈవో కె.సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

### దోపిడీ కేసులో నిందితుల అరెస్టు



అరెస్టు అయిన నిందితులతో పోలీసులు



స్వాధీనం చేసుకున్న ఆభరణాలు, వస్తువులు

రాయగడ: రాయగడ నుంచి సరిహద్దు ప్రాంతమైన కెరడ వరకు ఇటీవల జరిగిన పలు దోపిడీ కేసులకు సంబంధించి శెఖాల్ పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రానికి చెందిన మీనాక సూర్యకుమార్ (37), విశాఖపట్నం జిల్లా ఆరిలోవకు చెందిన పి.చంద్రోశేఖర్ (40), సదర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తుంబిగుడ ప్రాంతానికి చెందిన సిద్దు మెలక (23) ఉన్నారు. వీరి వద్ద నుంచి 123 గ్రాముల ఆరు బంగారు ముక్కలు, 41.999 గ్రాముల బంగారు గొలుసు, 34.540 గ్రాముల బంగారు మంగళసూత్రం, 13.110 గ్రాముల బంగారు చైన్, నాలుగు మొబైల్ ఫోన్లు, ద్విచక్ర వాహనన్నాని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులకు సంబంధించి ఎస్పీ హరీష్ బుధవారం రాయగడ జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. నిందితులు నిర్మానుష్యమైన ప్రాంతాల్లో కాపు కాసి ద్విచక్రవాహనాలను అడ్డగించి మారణాయుధాలతో బెదిరించి దోపిడీలకు పాల్పడుతుండేవారని వివరించారు. ఈ క్రమంలో శెఖాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గతేడాది నవంబరు నుంచి ఈ ఏడాది మే 5 వరకు ఏడు కేసులు నమోదు కాగా పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితులను పట్టుకున్నారని తెలిపారు. వీరందరినీ కోర్టుకు తరలిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో శెఖాల్ ఐఐసీ మున్ని ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

# అరుదైన వృక్ష జాతుల నిలయం

- జీవ వైవిధ్య ఉద్యానవనంలో పుష్పాలు కనువిందు
- పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటిన విద్యార్థులు



ముళ్ల మొక్కపై పుష్పాల కనువిందు



విరబూసిన మే ఫ్లవర్



మొక్కలు నాటుతున్న విద్యార్థులు, నగరవాసులు



ఉద్యానవనంలో వికసించిన పుష్పాలు

ఏయూ క్యాంపస్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని స్థానిక జీవ వైవిధ్య ఉద్యానవనంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పలు కళాశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని మొక్కలు నాటారు. జీవ వైవిధ్య ఉద్యానవనాన్ని సరిగ్గా 22 సంవత్సరాల క్రితం జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజున ప్రారంభించామని నిర్వాహకుడు డాక్టర్ మంథా రామమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా డాల్ఫిన్ నేచర్స్ కన్జర్వేషన్ క్లబ్, యూనిటీ డిగ్రీ కళాశాల, సెయింట్ జోసఫ్ కాలేజ్ ఫర్ విమెన్ సంయుక్తంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాయి. 100 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఔషధ మొక్కలను ఉద్యానవనం ప్రాంగణంలో నాటారు. మూడెకరాల విస్తీర్ణంలో విస్తరించిన ఈ ఉద్యానవనంలో మూడు వేలకు పైగా మొక్కలు పెంచుతున్నారు. నేల మీద, నీటిలో, చెట్లపైన జీవించే మొక్కలు ఇక్కడ కనువిందు చేస్తున్నాయి. ఎడారిలో మాత్రమే పెరిగే ముళ్ల మొక్కలు సైతం వందలాదిగా ఇక్కడ మనంకు దర్శనమిస్తాయి.

### ఈఎన్‌టీలో వీడియో ఎండోస్కోపీ ప్రారంభం



వీడియో ఎండోస్కోపీని ప్రారంభిస్తున్న డాక్టర్ బుచ్చిరాజు

ఏయూక్యాంపస్: ప్రభుత్వ చెవి, ముక్కు, గొంతు ఆస్పత్రిలో నూతనంగా అందుబాటులోకి వచ్చిన వీడియో ఎండోస్కోపీ యూనిట్, ఆధునికీకరించిన ఓపీడీ, వైద్యుల చాంబర్లను బుధవారం ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు ప్రారంభించారు. ఎండోస్కోపీ యూనిట్‌ను మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి బహూకరించిన సంగతి తెలిసిందే. ఓపీడీలో పీజీ, యూజీ విద్యార్థులకు ఆడియో విజువల్ ఎడ్యుకేషన్ అందించడానికి వీడియో ఎండోస్కోపీ ఉపకరిస్తుందని సూపరింటెండెంట్ డాక్టర్ హరికృష్ణ తెలిపారు.